# సాక్షి
## వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 13 । జనవరి । 2024






### సాహసం.. మా పథం

కడప వైవీయూ, వైఎస్ఆర్ఏఎఫ్‌యూలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ స్థాయిలో అడ్వెంచర్ శిక్షణ పూర్తి చేసుకున్నారు. దేశసేవకు సై అంటున్నారు. -8లో



### పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

పేదల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి శుక్రజువారం పేర్కొన్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
31.4/18.1

### వాతావరణం


జిల్లాలో శుక్రవారం 18.1 – 31.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

# మహిళకు మహోదయం

గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా పల్లెల్లో ప్రభుత్వ పరిపాలన కొనసాగుతోంది. ప్రజలకు నాలుగున్నరేళ్లుగా సంతృప్త స్థాయిలో నవరత్నాల పథకాలు అందుతున్నాయి. ఆర్థిక పరిపుష్టితో ఆనందంగా జీవనం సాగిస్తున్నారు. సంక్షేమ కాంతులతో గడపగడపన ముందస్తు సంక్రాంతి శోభ నెలకొంది.

- అక్కచెల్లెమ్మలకు అండగా నిలిచిన జగనన్న ప్రభుత్వం
- బ్యాంకు లింకేజీ, సున్నా వడ్డీ, వైఎస్ఆర్ చేయూత పథకాలతో మహిళా సంఘాలకు ఆర్థిక పరిపుష్టి



**సాక్షి ప్రతినిధి, కడప:** మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సంక్షేమ పథకాలకు వారినే ప్రధాన లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితులను సైతం అధిగమించి ఎలాంటి ఆటంకం లేకుండా అతివల ఇంటి ముంగిళ్లకే సంక్షేమ పథకాలు అందించారు. వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం రాయితీ, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా, జగనన్న చేదోడు వంటి పథకాల ద్వారా బాసటగా నిలిచారు. జిల్లాలో 27,590 స్వయం సహాయక సంఘాల్లో 2,79,477 మంది, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలోని మరో 14,560 స్వయం సహాయక సంఘాల్లో 1,49,638 మంది సభ్యులుగా ఉన్నారు. బ్యాంకుల రుణసాయంతో వీరంతా ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు.

**బ్యాంకు లింకేజీ ద్వారా సాయం...**

బ్యాంకు లింకేజీ ద్వారా ఆర్థికసాయం అందుతోంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గత నవంబర్ 30 నాటికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పరిధిలోని 20,500 ఎస్‌హెచ్‌జీలకు రుణ పంపిణీ లక్ష్యం కాగా 11,758 మహిళా సంఘాలకు రూ.897.57 కోట్లు ఆన్‌లైన్ ద్వారా అందించారు. స్త్రీ నిధి పథకం ద్వారా 32,400 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణ పంపిణీ లక్ష్యం కాగా 22,976 మందికి రూ.124.69 కోట్లు అందించారు. పట్టణ ప్రాంతాల్లోని మెప్మా నిర్వహణలో ఉన్న 5006 స్వయం సహాయక సంఘాలకు రూ.672.37కోట్ల మేర రుణాలు దక్కాయి.

**'వైఎస్ఆర్ సున్నా వడ్డీ'తో ఆర్థికభరోసా**

స్వయం సహాయక సంఘ మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని, ఆర్థిక భరోసాను నింపి, వారు ఆర్థికాభివృద్ధికి సాధించడానికి వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. బ్యాంకుల్లో రుణాలు తీసుకుని క్రమం తప్పకుండా చెల్లిస్తున్న గ్రూపులకు వారి రుణాలపై వడ్డీ రాయితీని ప్రభుత్వమే భరిస్తోంది. ఆయా మహిళా సంఘాల రుణ వడ్డీ మొత్తాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు మూడు విడతల్లో 27,010 సంఘాలకు రూ.187.52 కోట్లను ప్రభుత్వం పంపిణీ చేసింది. మెప్మా పరిధిలో రూ.74.16 కోట్లు మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది.

**అండగా 'వైఎస్ఆర్ ఆసరా'**

రాష్ట్ర మహిళాభ్యుదయంలో మైలురాయిగా నిలుస్తున్న 'వైఎస్ఆర్ ఆసరా'పథకం రుణాల మాఫీ కార్యక్రమంగానే కాక మహిళలను ఆర్థిక స్వతంత్రులుగా తీర్చిదిద్దేందుకు తోడ్పడుతోంది. ప్రతి మహిళకు అందిన రుణమాఫీ సొమ్ముతో ఉపాధి యూనిట్లను నెలకొల్పుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా డీఆర్‌డీఏ పరిధిలో 21,058 స్వయం సహాయక సంఘాలకు ఇప్పటి వరకు మూడు విడతలుగా రూ.516.74 కోట్లు జమ చేశారు. మెప్మా పరిధిలో రూ.250.63 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయింది.

**వెలుగులు నింపిన 'వైఎస్ఆర్ చేయూత'**



అక్కచెల్లెమ్మల జీవితాలల్లో వెలుగులు నింపేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'వైఎస్సార్ చేయూత'పథకం అండగా నిలుస్తోంది. వృద్ధాప్యానికి చేరువగా, కష్టం చేయలేని స్థితిలో ఉన్న 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల మహిళలకు ప్రభుత్వం ప్రతిఏటా రూ.18,750 చొప్పున వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తోంది. నాలుగేళ్లలో రూ.75,000లను ఉచితంగా అందిస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు 2,51,675 మంది సభ్యులకు రూ.471.87 కోట్లు ప్రభుత్వం మూడు విడతలుగా అందించింది. మెప్మా పరిధిలో 28,445 మంది మహిళలకు రూ.152.15 కోట్లు అందించింది. వచ్చే ఫిబ్రవరి మాసంలో నాలుగో విడత మొత్తాన్ని కూడా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. అదే విధంగా చిరువ్యాపారులకు సైతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ అండగా నిలుస్తోంది. అర్హులైన చిరు వ్యాపారస్తులకు రూ.10 వేల ఆర్థిక రుణాన్ని అందిస్తున్నారు. ఈ పథకం ద్వారా డీఆర్డీఏ, మెప్మాతో కలిపి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ఎనిమిది విడతల్లో 89,848 మందికి రూ.163.18 కోట్లు పంపిణీ చేశారు. రాష్ట్రంలోనే జిల్లాలో అత్యధిక మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరడం విశేషం.

### సీఎం అన్నలా మారారు



పేద మహిళలకు సీఎం సొంత అన్నలా మారారు. వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా మూడు విడతల్లో రూ.57,960 రుణం పొందాను.ఆ సొమ్మును కిరాణా కొట్టు అభివృద్ధికి వినియోగించాను. వ్యాపారం బాగా నడుస్తోంది.

-వెంకటసుబ్బమ్మ, శ్రీవెంకటేశ్వర ఎస్‌హెచ్‌జీ, బందలకుంట, ముద్దనూరు మండలం

### జగనన్న రుణం తీర్చుకోలేం



మహిళల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. మా గ్రూపు ద్వారా మూడు విడతల్లో రూ. 41,400 వైఎస్ఆర్ ఆసరా సాయం అందింది. సున్నా వడ్డీ మొత్తం రూ.57,200 వచ్చింది. ఈమొత్తం ద్వారా కిరణా షాపు నిర్వహిస్తున్నా. ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నా. జగనన్న రుణం తీర్చుకోలేం. – సి సుజాత, అంజనేయస్వామి ఎస్‌హెచ్‌జీ, కె కొత్తపల్లె, ముద్దనూరు

### కొండంత అండ



కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో పనులులేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలకు బ్యాంకు లింకేజీతో పాటు, సున్నా వడ్డీ పథకం రాయితీ, వైఎస్ఆర్ చేయూత వంటి పథకాలు ఆర్థికంగా అండగా నిలిచాయి. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారు. – విజయరామరాజు, జిల్లా కలెక్టర్

# సామాజిక సమతా సంకల్పంతో స్ఫూర్తి

**జేసీ గణేష్ కుమార్**



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జేసీ, ఇతర అధికారులు

**కడప సెవెన్‌రోడ్స్:** రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 'సామాజిక సమత సంకల్పం' జిల్లాలోని అన్ని వర్గాల ప్రజల్లో స్ఫూర్తి నింపుతోందని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సామాజిక సమతా సంకల్ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగాన్ని రూపొందించిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిర్దేశించిన సామాజిక న్యాయ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయానికి నిలువెత్తు ప్రతిరూపంగా విజయవాడలోని స్వరాజ్య మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. 20 ఎకరాల విస్తీర్ణంలో దాదాపు రూ.400 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ స్మృతివనంలో ఈ విగ్రహం ఏర్పాటు చేశారన్నారు. విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల 19న అవిష్కరిస్తారన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక న్యాయ కార్యక్రమాలను ప్రతిబింబించేలా ఈ నెల 9వ తేదీ నుంచి 19 వరకు.. 'సామాజిక సమతా సంకల్పం' కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా కలెక్టరేట్ లో ఛాయా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారన్నారు. తొలుత డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి జేసీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ప్రభాకర్ రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి, ఎస్సి, బిసి, మైనార్టీ కార్పొరేషన్ల ఈడీలు డాక్టర్ వెంకట సుబ్బయ్య, జయసింహ, డాక్టర్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు



## న్యూస్‌రీల్

### రేపు గోదా కల్యాణం

**వల్లూరు:** ప్రముఖ పుణ్య క్షేత్రంగా వెలుగొందుతున్న పుష్పగిరిలో భోగి పండుగ నాడైన ఆదివారం గోదాదేవి కల్యాణం జరుగుతుందని ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో తెల్లవారుజామున 5 గంటలకు స్వామివారికి బిందె తీర్థ సేవ, సహస్ర నామార్చన, ధనుర్మాస ఆరాధన జరుగుతాయని తెలిపారు. ప్రత్యేక పూజల అనంతరం ఉదయం 10 గంటలకు గోదా దేవి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**కడప స్పోర్ట్స్:** కల్నల్ మద్రాసు ఇంజినీరింగ్ గ్రూపు అండ్ సెంటర్ బెంగుళూరు ఆధ్వర్యంలో నిర్వహించే 'ఆర్మీ బాలుర క్రీడా కంపెనీ'లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి తెలిపారు. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పతకాలు సాధించిన 14 నుంచి 16 ఏళ్లలోపు వయసు కలిగిన బాలురు ఎంపికలకు అర్హులన్నారు. ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీ వరకు కేంద్రీయ విద్యాలయం, మద్రాసు ఇంజినీరింగ్ సెంటర్, బెంగుళూరు గ్రౌండ్‌లో ఎంపికలు జరుగుతాయన్నారు. బాక్సింగ్, హాకీ, సెయిలింగ్, స్విమ్మింగ్ క్రీడాంశాల్లో ప్రవేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

### 'కొత్త(పేట) కలాల'కు పురస్కారం



**ప్రొద్దుటూరు:** పట్టణానికి చెందిన కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు శిక్షణ, సంపాదకత్వంలో కొత్త పాఠశాల విద్యార్థులు రాసిన 'కొత్తపేట కలాలు' బాలల కథల పుస్తకానికి ప్రతిభా పురస్కారం లభించింది. తెలంగాణ రాష్ట్రం రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన డాక్టర్ చింతోజు బ్రహ్మయ్య బాలామణి ప్రతిభా పురస్కారానికి న్యాయనిర్ణేతల మండలి ఈ పుస్తకాన్ని ఎంపిక చేసిందని డీకే చదువుల బాబు శుక్రవారం తెలిపారు. ప్రతిభగల బాలలకు కథారచనలో శిక్షణ ఇచ్చి 2020లో వారు రాసిన కథలతో ఈ పుస్తకాన్ని ప్రచురించినట్లు చెప్పారు.

# ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా



కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

**కడప కార్పొరేషన్:** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందడంతో.. నూతన సంవత్సర ఆరంభానికి ముందే.. జిల్లాలో సంక్రాంతి కళ సంతరించుకుందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. భోగి మంటల వెచ్చటి వెలుగులు పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని ప్రసాదించాలని... మకర సంక్రాంతి కాంతులతో ప్రతీ ఇల్లు సంక్షేమ,. సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాలని ఆకాంక్షించారు. వీరితోపాటు ఎమ్మెల్సీలు డీసీ గోవిందరెడ్డి, రామసుబ్బారెడ్డి, ఎంపీ రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, పి. రవీంద్రనాథ్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, డా. దాసరి సుధ, డా. సుధీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు, ఎస్.పి. సిద్ధార్థ్ కౌశల్, జేసి గణేశ్ కుమార్, జిల్లాలోని ఇతర ప్రజాప్రతినిధులు జిల్లా ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

# ఆరోగ్యశ్రీతో పేదల ఆరోగ్యానికి భరోసా



ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రవిబాబు

**బద్వేలు అర్బన్:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంతో పేదల ఆరోగ్యానికి భరోసా లభిస్తుందని అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.రవిబాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని చింతలచెరువు పంచాయతీ సచివాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం నూతన ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం ద్వారా నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు ఖరీదైన వైద్యం అందనుందని తెలిపారు. కార్యక్రమంలో అంధత్వ నివారణ సంస్థ జిల్లా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీత, మండల స్పెషలాఫీసర్ ఖాదర్‌బాష, ఎంపీడీఓ నూర్జహాన్, వైద్యాధికారులు డాక్టర్ జోత్స్నస్వర్ణలత, డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ ఆనంద్, డాక్టర్ శ్రీనివాసులు, ఆఫ్తాలిమిక్ అసిస్టెంట్ హుస్సేనయ్య, ఫిజియోథెరపి వైద్యులు విక్టర్‌మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ

**కడప రూరల్:** కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ పారదర్శకంగా జరుగుతుంది. ఎవరైనా ప్రలోభాలకు గురి చేస్తే నమ్మవద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో 2014 ముందు నుంచి వివిధ కేటగిరీలకు చెందిన కాంట్రాక్ట్ ఉద్యోగులు పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. నిబంధనల మేరకు వారిని శాశ్వత ప్రాతిపదికన క్రమబద్ధీకరించే ప్రక్రియ జరుగుతోందన్నారు.

# స్వామి వివేకానంద భారతదేశ ఐకాన్

**మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ బ్రహ్మయ్య**



స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డాక్టర్ బ్రహ్మయ్య తదితరులు

**కడప ఎడ్యుకేషన్:** స్వామి వివేకానంద భారతదేశ ఐకాన్ అని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ బ్రహ్మయ్య పేర్కొన్నారు. కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం వివేకానంద జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, మైనార్టీ కార్పొరేషన్ ఈడి డాక్టర్ బ్రహ్మయ్యలు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం డాక్టర్ బ్రహ్మయ్య మాట్లాడుతూ స్వామి వివేకానందను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు నడవాలన్నారు.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి స్పెషల్ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద బోధనలు యువతను ప్రేరేపించడమే కాకుండా దేశాభివృద్ధికి మార్గం సుగమం చేశాయని అన్నారు. అనంతరం పోటీలలో విజేతలైన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు గోవిందరావు, షకీలాబేగం, స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, కళాశాల, స్టెప్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కోడిపందెం రాయుళ్ల అరెస్ట్

కడప అర్బన్ : కడప నగర శివారులోని రిమ్స్ పీఎస్ పరిధి రామకృష్ణ నగర్ సమీపంలో కోడి పందాలు ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేశారు. సీఐ రామచంద్ర ఆధ్వర్యంలో ఎస్ఐ నారాయణ తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి, వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఐదు కోడి పుంజులు, రూ.6770 నగదు స్వాధీనం చేసుకున్నారు.

### కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివారులోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలకు న్యాక్ ఉత్తమ ఏ గ్రేడ్(3.14 సీజీపీఏ)ను ప్రకటించిందని ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఈ నెల 4, 5 తేదీలలో న్యాక్ బృందం కళాశాలను సందర్శించి అన్ని రకాల మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలు తదితరాలను తనిఖీ చేసి ఏ గ్రేడ్ ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు.

### యువకుడి ఆత్మహత్య



యాకుబ్ మృతదేహం

కడప అర్బన్ : కడప నగరంలోని సాయిపేటకు చెందిన సయ్యద్ కరీం కుమారుడు సయ్యద్ యాకుబ్ (21) అనే యువకుడు ఈ నెల 11న రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యాకూబ్ చదువుకుంటూ పనికి వెళ్లేవాడు. ఈ నెల 11వ తేదీన అతని తల్లిదండ్రులు, చెల్లెలు నంద్యాలకు వెళ్లారు. అతని సోదరుడు కలెక్షన్ బాయ్‌గా పని చేస్తూ బయటకు వెళ్లి వచ్చాడు. ఆ సమయంలో తన అన్న ఫ్యాన్ కొక్కేనికి వేలాడుతూ వుండటంతో గమనించి చుట్టుపక్కల వారి సహకారంతో కిందికి దించి ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడికి తీసుకుని వెళ్లగానే చనిపోయాడని డాక్టర్లు తెలియజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి తండ్రి కరీం ఫిర్యాదు మేరకు కడప టూటౌన్ ఎస్ఐ సంజీవరాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

### ఫైనాన్స్ వ్యాపారి..



రమణారెడ్డి (ఫైల్)

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని అంబకపల్లె రోడ్డు సమీపాన ఉన్న నగరవనంలో శుక్రవారం ఉదయం ఓ ఫైనాన్స్ వ్యాపారి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వేముల మండలం పెండ్లూరు గ్రామానికి చెందిన గజ్జల రమణారెడ్డి(68) పదేళ్ల క్రితం పులివెందులకు వచ్చి స్థిరపడ్డాడు. రాఘవేంద్ర హాలు సమీపంలో భార్య రామసుబ్బమ్మ, కుమారుడితోపాటు నివాసముంటున్నాడు. పట్టణంలోని చిరు వ్యాపారస్తులకు ఫైనాన్స్ రూపంలో వడ్డీలకు అప్పు ఇస్తుండేవాడు. ఈ క్రమంలో ఇతరుల వద్ద తక్కువ వడ్డీకి రూ.12 లక్షల మేర అప్పు తీసుకుని, ఎక్కువ వడ్డీకి ఫైనాన్స్ ఇచ్చాడు. ఆయనకు ఇతరులు అప్పు తిరిగి చెల్లించలేదు. కానీ అతను తీసుకొన్న చోట చెల్లించాల్సి వచ్చింది. దీంతో మానసిక ఒత్తిడికి గురై నగరవనం కాంపౌండ్‌కు ఉన్న కడ్డీలకు తన పంచెతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హుస్సేన్ తెలిపారు.

# సాహసం.. మా పథం

- హిమాచల్ ప్రదేశ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు
- అత్యవసర సేవల్లో దేశసేవకు సై అంటున్న విద్యార్థులు

**అనుకోకుండా ఎదురయ్యే విపత్తుల నుంచి ప్రజలను కాపాడేందుకు.. వరదలు సంభవించిన సమయంలో బాధితులను ఆదుకోవడం మొదలు.. దేశానికి అవసరమయ్యే సేవలను అందించడంలో ముందుంటామంటూ యోగివేమన విశ్వవిద్యాలయం, డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పేర్కొంటున్నారు. ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన అడ్వెంచర్ క్యాంపులో శిక్షణ పూర్తి చేసుకున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లపై ప్రత్యేక కథనం.**

వైవీయూ/ఏఎఫ్‌యూ : కడప యోగివేమన విశ్వవిద్యాలయం, డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ స్థాయిలో అడ్వెంచర్ శిక్షణ పూర్తి చేసుకున్నారు. గత నెల 19 నుంచి 28వ తేదీ వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని అటల్ బిహారీ వాజ్‌పేయి మౌంటెనీరింగ్ కళాశాలలో నిర్వహించిన 10 రోజుల ప్రత్యేక శిక్షణలో జిల్లా యువత పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్నారు. వరదలు సంభవించినప్పుడు బాధితులను ఆదుకోవడం, నదులు, వంకలు, వాగుల్లో నుంచి వారిని కాపాడటం, కొండప్రాంతాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు అక్కడి ప్రజలను రక్షించడం వంటి సాహస అంశాల్లో పాల్గొన్నారు. తాడు సాయంతో కొండలు ఎక్కడం, దిగడం, నదులు, లోయలు దాటడం వంటి అంశాల్లో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. దేశంలోని విభిన్న ప్రాంతాలకు చెందిన విద్యార్థులతో కలిసిమెలిసి శిక్షణలో పాల్గొనే అవకాశం లభించడంతోపాటు సాహసయాత్రలో ఎన్నో గొప్ప అనుభూతులు, ఆత్మవిశ్వాసాన్ని నింపిందని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తమ మనోగతాన్ని పంచుకున్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి వైవీయూకు చెందిన ఎంపీఏ అధ్యాపకుడు డాక్టర్ కె.శ్రీనివాసరావు కంటింజెంట్ లీడర్‌గా వ్యవహరించారు.



హిమాచల్ ప్రదేశ్‌లో నేషనల్ అడ్వెంచర్ క్యాంపులో శిక్షణ పొందుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

#### ఎత్తయిన శిఖరాలను అధిరోహించే అవకాశం



హిమాచల్ ప్రదేశ్‌లోని హట్‌కోటి ప్రాంతంలో నిర్వహించిన 10 రోజుల నేషనల్ అడ్వెంచర్ క్యాంప్‌లో ఎత్తయిన పర్వత శిఖరాలను అధిరోహించే అవకాశం లభించింది. క్యాంపులో పాల్గొనడం ఎంతో ఆత్మవిశ్వాసాన్ని కలిగించింది. శిక్షణ మాలో ధైర్యాన్ని నింపింది.
– కె.శ్రావణి, ఎంఎస్సీ జువాలజీ, వైవీయూ

#### వివిధ రాష్ట్రాల సంస్కృతులు తెలుసుకున్నాం



నేషనల్ అడ్వెంచర్ క్యాంపునకు వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వచ్చారు. ఇందులో భాగంగా పది రోజుల పాటు వారితో కలిసి ఉండటం ద్వారా వారి సంస్కృతి, పద్ధతులు తెలుసుకునే అవకాశం లభించింది. క్యాంపులో పాల్గొనే అవకాశం కల్పించిన వైవీయూ అధికారులకు ధన్యవాదాలు.
– డి.మానస, ఎంసీఏ, వైవీయూ

#### విపత్తువేళ స్పందించేలా..



అనుకోకుండా ఏవైనా విపత్తులు తలెత్తితే ఎలా స్పందించాలి, బాధితులను ఎలా కాపాడాలన్న అంశంపై శిక్షణ ఇచ్చారు. కొండలు, వాగులు, వంకలు దాటడం నేర్చుకున్నాం. దేశానికి అవసరమైన సమయంలో సేవ చేసేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నాం.
– సి.వి.ఎస్.సుబ్రమణ్యం, ఎంబీఏ, వైవీయూ

#### కొత్త ప్రాంతాలు చూసే అవకాశం



నేషనల్ అడ్వెంచర్ క్యాంపు ద్వారా ఎప్పుడూ చూడని ప్రదేశాలను చూసే అవకాశం లభించింది. గంగానదీ ప్రవాహం, వీరలంకస్వామి గుడి, హటకేశ్వరీ దేవి మాత ఆలయాలను సందర్శించాం. అక్కడి సంస్కృతులు, ఆచారాలు వేరుగా ఉన్నా భిన్నంగా ఉన్న పరిస్థితుల్లో ఎలా నడుచుకోవాలో తెలిసొచ్చింది.
– కె.జగదీష్‌కుమార్, ఎంపీసీఏ, వైవీయూ

## నవశకం

### నెరవేరిన సొంతింటి కల



మేము నిరుపేదలం. ఇంటి కోసం గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. నవరత్నాల్లో భాగంగా జగనన్న ప్రభుత్వం ఇల్లు లేని వారికి ఇల్లు మంజూరు చేయడంతో వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేసుకున్నాం. ఎట్టకేలకు మా సొంతింటి కల నెరవేరింది.
– కోవెలకుంట్ల వరలక్ష్మి, కాలువపల్లె, గోపవరం మండలం

### కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్య



జగనన్న ప్రభుత్వం కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ విద్యను అందిస్తోంది. వేలకోట్లు ఖర్చు చేసి పాఠశాలలకు నూతన భవనాల నిర్మాణం, మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఉచితంగా అందజేసిన పుస్తకాల క్వాలిటీ బాగుంది.
– వి.శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు, దూళ్ళవారిపల్లె, రాయచోటి

# పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- శాశ్వత భూ హక్కు పత్రాల పంపిణీ
- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లె : పేదల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అశోక్ నగర్ గ్రామంలో పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి పేదల భూములకు శాశ్వత హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించడంతోపాటు నిరుపేదలకు భూమి పంపిణీ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మండలంలోని రైతు కుటుంబాలకు వ్యవసాయ అసైన్డ్, ఈనం, ఎస్సీ కార్పొరేషన్ తదితర వాటిల్లో 22ఏ జాబితా నుంచి తొలగించి పేదలకు భూములు పంపిణీ చేయడం జరిగిందన్నారు. మొత్తం 399 మంది రైతులకు గానూ 620 ఎకరాలు పంపిణీ చేశామన్నారు.



పేదల భూములకు శాశ్వత హక్కు పత్రాలు అందిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

**గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం**

గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తాళ్లపల్లె, కుప్పాలపల్లె గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, జగనన్న పాలవెల్లువ మహిళా డెయిరీని ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన అందిస్తున్నారన్నారు. సచివాలయం పక్కనే రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ సెంటర్, పాడి పరిశ్రమపై ఆధారపడిన పాడి రైతులకు పాల కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, సర్పంచ్‌లు ఆర్.శ్రీనివాసులు, మారం సులోచనమ్మ, మల్లయ్య, బంకా సోమేశ్వరరెడ్డి, రామ గంగిరెడ్డి, మాజీ సర్పంచ్ ఆర్‌ఎల్వీ ప్రసాద్‌రెడ్డి, మిట్టా శ్రీనివాసులు, ఎంపీడీఓ దివిజ సంపతి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నాయకులు



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

వేంపల్లె : వేంపల్లెలోని 30 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక త్యాగరాజు కల్యాణ మండపంలో నియోజకవర్గ నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వి.వి.రత్నం ఆధ్వర్యంలో కల్లూరు హరి, శివ, మోపూరి రమేష్, సగబాల బాలముని, శివరాం, కొండయ్య, బాలయ్యతోపాటు 30 కుటుంబాల వారికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని.. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా చూస్తూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథకంలో నడిపిస్తున్నారన్నారు. అందుకే పార్టీలో చేరేందుకు తాము నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హజ్ హౌస్ కమిటీ రాష్ట్ర చైర్మన్ మునీర్, ఎంపీటీసీలు మణిగోపాల్‌రెడ్డి, కటిక చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

## టీవీ5 తప్పుడు ప్రచారం

**తనను బలహీనపరిచేందుకేనన్న ఎమ్మెల్యే రాచమల్లు**



ప్రొద్దుటూరు : వ్యక్తిగత దురుద్దేశంతో తనను బలహీనపరిచేందుకే టీవీ 5 తప్పుడు ప్రచారం చేసిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలీసు శాఖ గురించి తాను ప్రస్తావించనే లేదని, ఎక్సైజ్ అధికారులపై అన్న మాటలను కూడా వెనక్కి తీసుకుంటున్నానన్నారు. గురువారం చోటుచేసుకున్న సంఘటన గురించి ఆయన చెబుతూ పట్టణంలోని తొగటవీర క్షత్రియ కులానికి చెందిన సాధారణ వ్యక్తి తల్లి కర్మకాండల సందర్భంగా ప్రభుత్వ మద్యం షాపులో బాటిళ్లను కొని తీసుకెళుతుండగా ఎస్ఈబీ అధికారులు పట్టుకున్నారన్నారు. వెంటనే ఆ వ్యక్తి తనకు ఫోన్ చేసి అధికారులు పట్టుకున్నారని, దీని వల్ల తన తల్లి కర్మకాండలు ఆగిపోయే అవకాశం ఉందని తెలిపాడన్నారు. ఫోన్‌చేస్తున్న తాను హుటాహుటిన ఎస్ఈబీ కార్యాలయానికి వెళ్లి ఆ వ్యక్తిని ఇంటికి పంపించానన్నారు. ఆ సందర్భంగా తాను ఎక్సైజ్ అధికారులను ఉద్దేశించి మాట్లాడిన మాటలను వక్రీకరించి టీవీ 5 ఛానల్ తప్పుగా చూపించిందన్నారు. ఇది పోలీసు డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన అంశం కాదని, కేవలం ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌కు చెందిందని తెలిపారు. తన మాటల వలన ఎక్సైజ్ అధికారులు బాధపడి ఉంటే పెద్ద మనసుతో తనను మన్నించాలని కోరారు. తనకు అధికారుల పట్ల సంపూర్ణ విశ్వాసం, గౌరవం ఉందన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి




మృతి చెందిన షరీఫ్, ఇమామ్

మైదుకూరు : మైదుకూరు పట్టణ శివారులో శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. పట్టణంలోని శాంతినగర్ కు చెందిన ఇమామ్ (25), షరీఫ్ (22) కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారి బైపాస్ వద్ద ఉన్న తిరుమల డాబా దగ్గర ఉండగా, గుర్తుతెలియని వాహనం ఢీకొట్టినట్టు తెలుస్తోంది. సంఘటనలో షరీఫ్ అక్కడికక్కడే మృతి చెందగా, ఇమామ్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. అక్కడున్న వారు 108 వాహనానికి సమాచారం అందించగా, ఇమామ్ను 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేసేలోపే ఇమామ్ మృతి చెందినట్లు తెలుస్తోంది. శనివారం సంతకు వెళ్లేందుకు ఇంటి వద్ద నుంచి బయలుదేరిన ఈ యువకులు టీ తాగేందుకు స్థానిక నంద్యాల రోడ్డులోని తిరుమల డాబా వద్దకు వెళ్లినట్టు సమాచారం. మృతులిద్దరూ సోదరులు అని తెలుస్తుంది. మైదుకూరు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి యువకుల మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.




## టిప్పర్ ఢీకొని వృద్ధుడి మృతి



మృతి చెందిన దస్తగిరి సాహెబ్

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో టిప్పర్ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. అర్బన్ సీఐ ఈశ్వరయ్య తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రగుంట్ల పట్టణంలోని శ్రీరాములపేటలో దస్తగిరి సాహెబ్ (72) నివాసం ఉంటాడు. చాలా ఏళ్ల నుంచి నాలుగు రోడ్ల కూడలిలో తోపుడు బండిపై అరటి పండ్లను పెట్టుకుని వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తుండే వాడు. ఆయన భార్య ఏడాది కిందటే మృతి చెందింది. వీరికి కుమారుడితోపాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలందరికీ వివాహం చేశారు. కుమారుడు గల్ఫ్ దేశానికి జీవనోపాధి కోసం వెళ్లాడు. దస్తగిరి మాత్రం అరటి పండ్ల వ్యాపారం చేసుకుంటున్నాడు. తన తోపుడు బండిని నాలుగు రోడ్ల కూడలి వద్దనే ఉంచుకునే వాడు. రోజూ సైకిల్‌పై అరటి పండ్లను నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న తోపుడి బండి వద్దకు తీసుకొని పోయి అక్కడే వ్యాపారం చేసుకుని రాత్రి ఇంటికి సైకిల్‌పై వెళ్లేవాడు. శుక్రవారం సాయంత్రం కూడా అరటి పండ్ల వ్యాపారం చేసుకోవడానికి సైకిల్‌పై వస్తుండగా నాలుగు రోడ్ల కూడలి వద్దకు రాగానే అతి వేగంగా వస్తున్న టిప్పరు ఢీకొంది. ఈ ప్రమాదంలో దస్తగిరిపై టిప్పరు దూసుకెళ్లడంతో టైర్ల కిందపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. కొన ఊపిరితో ఉన్న ఆయనను 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి వెళ్లగానే దస్తగిరి మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఈశ్వరయ్య తెలిపారు.

## బెస్ట్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న అధ్యాపకురాలు నీలవేణి

కడప ఎడ్యుకేషన్ : నందలూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పని చేస్తున్న డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణికి రాష్ట్ర స్థాయి బెస్ట్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అవార్డు వరించింది. శుక్రవారం విజయవాడ సెక్రటేరియెట్ కార్యాలయంలో రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారుల చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పని చేస్తున్న సమయంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్‌గా రూకవారిపల్లె, కడప, ఆలంఖాన్‌పల్లి, చెన్నూరు తదితర ప్రాంతాల్లో స్పెషల్ క్యాంపులు నిర్వహించి స్వచ్ఛభారత్, మొక్కల పెంపకం, మెడికల్ క్యాంపులతోపాటు పలు అవగాహన సదస్సులు నిర్వహించారు. దీంతోపాటు ప్రజల్లో పలు అంశాలపై చైతన్యం కలిగించారు. యువతను స్వయం ఉపాధి దిశగా ఆలోచింప చేయడంతోపాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే తలా పిరికెడు బియ్యం కార్యక్రమం ద్వారా పలువురి దగ్గర నుంచి బియ్యాన్ని సేకరించి అనాథ ఆశ్రమాలకు అందించడం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వీటిని గుర్తించిన రాష్ట్ర స్థాయి అధికారులు అవార్డు ప్రదానం చేశారు.

# సమన్వయంతో సమర్థంగా పని చేద్దాం

**జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్**

కడప అర్బన్ : రానున్న సార్వత్రిక ఎన్నికలలో అన్ని విభాగాలు కలిసి సమర్థవంతంగా పని చేద్దామని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ తెలిపారు. శుక్రవారం కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద వున్న 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని పోలీసు, సెబ్, ఆర్టీఏ, అటవీ శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా ప్రణాళికా బద్ధంగా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపడదామన్నారు. స్టాటిక్ చెక్ పోస్టులు, డైనమిక్ చెక్‌పోస్టులలో సమన్వయంతో పని చేద్దామన్నారు. బెల్ట్ దుకాణాలు జిల్లాలో వుండకూడదన్నారు. అక్రమంగా నగదు, బంగారు ఆభరణాల తరలింపు జరగకూడదన్నారు. ఎన్‌డీపీఎల్, డీపీఎల్ నిబంధనల ప్రకారం సీజ్ చేయాలన్నారు. పి.డి.యాక్టకు అర్హులైన వారిని గుర్తించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలిస్తున్న నగదు సీజ్, తదనంతర ప్రక్రియ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ సమావేశంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ కె. ప్రవీణ్‌కుమార్, డీటీసీ మీరాప్రసాద్, అటవీ, రవాణా, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

**ఉత్తమ పనితీరు కనపరిచిన సిబ్బందికి అవార్డు**

పోలీస్ సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ అత్యుత్తమ పనితీరు కనబర్చిన వారికి 'వీక్లీ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు'ను అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో నలుగురు సిబ్బందిని ఎంపిక చేసి నగదు రివార్డు ప్రశంసాపత్రం అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

- కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా వుంచడంతోపాటు క్రికెట్ బెట్టింగ్ కేసులో రూ.10,15,000 నగదు, 4 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకోవడంలో కీలకపాత్ర పోషించిన ఏఎస్ఐ పి.భాస్కర్‌ను ఎస్పీ అభినందించారు.
- బద్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కేసులో ఐదేళ్లుగా పరారీలో వున్న ఓ వ్యక్తిని లుక్ ఔట్ సర్క్యులర్ ద్వారా ఎయిర్‌పోర్ట్‌లకు వెళ్లి అరెస్ట్ చేశారు. సదరు కేసులో పోలీసులు నిందితుడి కోసం విస్తృతంగా గాలించారు. బృందంలోని బద్వేల్ పి.ఎస్ కానిస్టేబుళ్లు బి.రాజమోహన్, ఎన్.రమేష్ నిందితుడిని అరెస్ట్ చేశారు. వారికి ఎస్పీ ప్రశంసాపత్రం, నగదు రివార్డు అందజేశారు.
- సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న 'స్పందన' విభాగం కానిస్టేబుల్ షేక్ మున్నా, ఖాదర్‌వల్లిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాకు చెందిన జె.కె.సి.ఫిర్యాదులు 'స్పందన' ఫిర్యాదులను సకాలంలో ఆయా పోలీస్ అధికారులకు చేరవేస్తూ త్వరితగతిన పరిష్కారం కావడంతో కీలకపాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. అవార్డు అందుకున్న సిబ్బంది మున్ముందు ఇదే స్ఫూర్తితో విధులు నిర్వహించాలనీ జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.